# చిగురించిన ఆశలు

శ్రీ. ద్వారకా జవహర్

"శశీ !, నాకథలు మనిద్దరం తప్ప యింకెవరూ చదువరనే దానివి - మన బాబుకూడ యింక చదువుతాడులే !" అన్నాడు రమేశ్ తన కథ అచ్చైన పత్రికని శశికిస్తూ —

"ఔను, నాన్న — నాకు అప్పుడే 'అఆ'లు వచ్చాయా. అన్నీ నేర్చుకొని నీపుస్తకాలు చదువుతాలే" అని ముద్దుగా పలికాడు.

"అబ్బ చాలండి, యెలాగైతేనేం నేర్పారు మీ అబ్బాయికి అ, ఆలు" అంది శశి, తండ్రి కొడుకులను చూచి మురిసిపోతూ. తరువాత రమేశ్ బాబుకి చదువు చెప్పడంలోనూ, శశి పత్రిక చదువడంలోనూ నిమగ్నులయ్యారు.

రమేశ్, శశిలది నిర్మలమైన దాంపత్యం. వారి నోములపంటే చిన్నారి నాలుగేండ్ల బాబు. వారి వివాహానికి ముందు జరిగిన చరిత్రే మీరిపుడు చదువబోయేది-

♦ ♦ ♦

శశి జానకిరామయ్యగారి ఏకైక సంతానం. జానకిరామయ్యగారు డివిజినల్ ఇంజనీరుగా వుండేవారు. శశి మాతృమూర్తిని గోల్పోయింది. వారింటి మీదివాటలోనే రమేశ్ వుంటూ లయోలా కాలేజీలో బి.ఏ. చదువుతుండేవాడు. శశికూడ స్కూలుఫైనలు చదువుతుండేది.

ఒకరోజు రమేశ్, శశిలకి మెల్లగా పరిచయం కలిగింది. రోజూ యేదో సమయంలో వారిద్దరూ కలసుకొనేవారు. శశి కొంటెప్రశ్నలేసి రమేశ్‌ని ఆడించేది. రమేశ్ వ్రాసిన కథలు అప్పుడప్పుడు పత్రికలలో వస్తుండేవి. వాటిని శశికి చూపించేవాడు రమేశ్. శశి లోపల ఆనందించినా "ఈ కథలు నీవు నేను తప్ప యింకెవరూ చదువరులే !" అని గేలిచేసేది.

ఒకరోజు జానకిరామయ్యగారికి బదిలీ ఔతోందని శశి రమేశ్‌తో చెప్పింది. రమేశ్ యెంతగానో విచారించాడు. కాని శశి రమేశ్‌కి ధైర్యం చెప్పి, దైవకృపవుంటే తిరిగి కలసుకొనగలమని ఊరడించింది.

రోజులు గడిచాయి. రమేశ్ బి ఏ. పూర్తిచేసి తన స్వగ్రామం వెళ్ళిపోయేడు. ఉత్సాహం పూర్తిగా అడుగంటింది. ఎవరికోసం జీవిస్తున్నాడో అతనికే తెలియదు. మొదట్లో శశికి ఉత్తరాలు వ్రాశాడుగాని జానకిరామయ్యగారు తిరిగి వివాహం చేసుకున్నారని, పిన్ని చాల ఖరాఖండి ఐనదని, ఉత్తరములు ఆమె చేతిలో పడి చాల ప్రమాదం కలిగించాయని శశి రమేశ్‌కి వ్రాసింది. లేఖలు వ్రాసి ఆమెకి లేనిపోని చిక్కులు తేవటం బాగులేదని వ్రాయటంకూడ మానుకున్నాడు.

ఒకరోజు అన్నం వడ్డిస్తూ రమేశ్ తల్లి పెళ్ళి ప్రశక్తి తెచ్చింది — "ఒరే, బాబూ, యశోదత్త రెండు మూడు రోజులలో నీకు సంబంధం తెస్తుందిరా" అంది గంపెడాశతో—

"నాకింక పెళ్ళి విషయం మాత్రం తలపెట్టకండమ్మ" అన్నాడు-

"అదేమిరా బాబూ, యశోదత్త సవతి కూతురొకమ్మాయి వుందట - నీకు సరిగ్గా ఈడూ - జోడూ కుదురుతుందట - చదువుకున్న పిల్లటవాడా - ఒకే అమ్మాయి కావటంవలన ఆస్తంతా ఆమెకే వస్తుందట - మనకింకేం కావాలి చెప్పూ !" అన్నదామె - అప్పుడె కొడుకూ కోడలూ చిలకా—గోరింకలలా వున్నట్లూహించుకుంటూ -

రమేశ్ చెప్పి లాభంలేదని సంభాషణ ఆపేశాడు.

ఒకరోజు పెళ్ళివారితో యిల్లంతా హడావిడిగావుంది. కాని రమేశ్‌లో యేమార్పులేదు. బలవంతంమీద రమేశ్‌ని కూర్చుండబెట్టారు అంతా - రమేశ్ ఊహలు శశిమీదకి పోయాయి తనకెదురుగా శశి కూర్చుంటే - అప్రయత్నంగా తలెత్తిచూశాడు - అరె, ఆశ్చర్యం ! ఆమె తన శశి ! రమేశ్‌కి అర్థమైంది కథంతా - శశి పిన్ని తన స్వయాం మేనత్తేనని, తన తండ్రి ఆఖరి చెల్లలని యేడాది క్రిందటే ఆమెకి సుందరరామయ్యగారితో వివాహం జరిగిందని తెలిసింది. శశికూడా వాలుచూపులతో రమేశ్‌ని చూచి పొంగిపోయింది

'ఏమిరా రాముా మా అమ్మాయి నచ్చిందా ? వాళ్ళ నాన్నకి శలవు లేదు గనుక నేనే పెద్దని'' అని అడిగింది యశోదత్త రమేశ్‌ని.

"పరవాలే దత్తయ్య'' అన్నాడు రమేశ్ ముసిముసి నవ్వులతో.

ఇది ఐదేండ్ల క్రిందటి కథ.